క్లుప్తంగా

అందరూ కలిసి మెలిసి ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: జాతి, మతం, కులం, వర్గం అనే బేధాలు లేకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐలు వాసుదేవరావు, ఉపేందర్ ఆధ్వర్యంలో శ్రీ రామనవమి సందర్భంగా గురువారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఏదైనా ఘటన జరిగితే మత, కుల పెద్దలు ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. వెంటనే పోలీసు స్టేషన్‌లో కూడా తెలుపాలన్నారు. ఏ చిన్న ఘటన జరిగినా సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని, ఈ పరిణామం సమాజానికి మంచిది కాదన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ వాసుదేవారావు, టూటౌన్ సీఐ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.40 వేల పరిహారం ఇవ్వాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): పంట ఎండిపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.40వేల నష్ట పరిహారం ఇవ్వాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన కాశబోయిన కనకయ్య–బాలవ్వకు సంబంధించిన ఎండిపోయిన వరి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎండిపోయిన పంటలను వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ లింగారెడ్డిపల్లి, ఇమాంబాద్ అగ్రికల్చర్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగారెడ్డిపల్లి, ఇమాంబాద్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

సీపీని కలిసిన పబ్లిక్‌ప్రాసిక్యూటర్



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీపీ ఆత్మారాములు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ కోర్టు, స్పెషల్ పోక్సో కోర్టు నూతన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆత్మారాములు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ అనురాధను ఆమె కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పోక్సో, మహిళలకు సంబంధించిన కేసుల్లో నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని సీపీ పీపీకి సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



దుబ్బాక: దుబ్బాక బస్‌డిపోలో అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఆర్పే విధానంతో పాటు ఎలా నివారించాలో ఆర్టీసీ కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఓ లక్ష్మణ్, ఆర్టీసీ అధికారి రవీందర్, ఫైర్ సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

సేంద్రియ సాగుపై శిక్షణ

రాజస్తాన్ వెళ్లిన రైతు దేవేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): రాజస్థాన్‌లోని మౌంట్ అబూలో సేంద్రియ వ్యవసాయంపై జరిగిన శిక్షణకు కౌడిపల్లి మండలంలోని తునికి దేవుల తండాకు చెందిన రైతు కొర్ర దేవేందర్ వెళ్లినట్లు ఏఓ స్వప్న, ఏఈఓ సహితి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రాజస్థాన్‌లో సస్టైనబుల్ యోగిక్ అగ్రికల్చర్ ప్రోగ్రాం సేంద్రియ వ్యవసాయ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ఆత్మ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి ఒక రైతును శిక్షణ కోసం ఎంపిక చేయగా, కౌడిపల్లి మండలం దేవులతండాకు చెందిన కొర్ర దేవేందర్ ఒక్కరే వెళ్లినట్లు చెప్పారు. మూడురోజుల పాటు అక్కడ జరిగే శిక్షణలో మిగతా రైతులతో కలిసి పాల్గొంటాన్నారు.

వేగం కంటే ప్రాణం ముఖ్యం

- ర్యాష్ డ్రైవింగ్.. ప్రాణాలతో చెలగాటం
- మద్యం మత్తులో ప్రమాదాలు
- అవగాహన కల్పిస్తున్నా మారని తీరు



మల్లారం వద్ద పల్టీ కొట్టిన కారు (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): నిబంధనలు పాటించండి.. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వేగం కన్న ప్రాణం ముఖ్యం అంటూ ప్రభుత్వం అవగాహన కల్పిస్తున్నా కొందరు వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. రాజీవ్ రహదారిపై రాంగ్ రూట్‌లో అతివేగంగా వెళ్తు ప్రాణాలు తీస్తున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం నిండు జీవితాన్ని చీకటిమయం చేస్తుందని పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. కానీ వారిలో మాత్రం మార్పు రావడం లేదు.

మద్యం మత్తులోనే..

మద్యం మత్తులో అతివేగంగా వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, రాంగ్ రూట్‌లో వెళ్లకుండా పోలీసులు అవగాహన కల్పిస్తున్న కొందరిలో తీరు మారడం లేదు. యువత మద్యం మత్తులో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రాజీవ్ రహదారిపై వెళ్లాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు.

కొన్ని రోడ్డు ప్రమాద ఘటనలు

- సిద్దిపేట పట్టణ శివారులోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు క్వాలీస్ వాహనంలో బీటెక్ మొదటి సంవత్సరం సెకండ్ సెమ్ పరీక్షలు కరీంనగర్‌లో రాయడానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో అనంతసాగర్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన లారీని ఢీకొట్టడంతో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి.
- హైదరాబాద్‌కు చెందిన మరియాల శ్రీనివాస్(60), అతడి కుమారుడు హన్మంత్‌రావు (26), కుటుంబ సభ్యులతో కలిసి కూతురుకు పెళ్లి సంబంధం చూడటానికి టాటా ఏసీ వాహనంలో కరీంనగర్‌కు వెళ్తున్నారు. మండల పరిధిలోని రామునిపట్ల శివారులో వారు ప్రయాణిస్తున్న ఆటో డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రి, కొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు.
- పెద్దపల్లి జిల్లాకు చెందిన సుధాకర్ దంపతులు, కూతురు, కుమారుడు, మరో బంధువుతో కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మల్లారం వద్ద ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం అతివేగంగా, రాంగ్ రూట్‌లో వచ్చి వీరి కారును ఢీకొట్టింది. దీంతో సుధాకర్ మృతి చెందగా, భార్య, పిల్లలకు గాయాలయ్యాయి. ఇలా నిత్యం రాజీవ్ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రమాదాలను నివారిస్తాం...

రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం రహదారిపై పెట్రోలింగ్ ముమ్మరంగా చేపడుతున్నాం. అతివేగంగా నడిపే వాహనాలను, రాంగ్ రూట్‌లో వచ్చే వాహనదారులకు జరిమానా విధిస్తున్నాం. వారికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

-బాలకృష్ణ, ఎస్ఐ, చిన్నకోడూరు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



చిన్నతిమ్మాపూర్‌లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్), వర్గల్(గజ్వేల్): పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ములుగు, అడవిమజీద్, చిన్నతిమ్మాపూర్, నర్సాపూర్, కొత్తూరు, బండమైలారం తదితర గ్రామాలు, వర్గల్ మండలంలోని అనంతగిరిపల్లిలో ఆయన అధికారులు, నాయకులతో కలిసి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ చేయడం చరిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆరీఫా, డీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు రంగారెడ్డి, సలీం, శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, ఏకాంబర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌గుప్త, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కర్ణాకర్‌గౌడ్, అర్జున్, సందీప్‌రెడ్డి, ఎర్రమల్లయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి నివాళులు



నంగునూరు(సిద్దిపేట): శివాజీ విగ్రహానికి నివాళులర్పిసున్న యూత్ సభ్యులు



చేర్యాల(సిద్దిపేట): శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. వీర శివాజీ యూత్, శివాజీ యువజన విభాగాలు, ఛత్రపతి శివాజీ మహారాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందూ సమాజ స్థాపనకు ఆయన చేసిన కృషిని కొనియాడారు.

ప్రహరీ కూల్చివేతపై డీఈఓకు ఫిర్యాదు



జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీని కూల్చివేసిన దృశ్యం

గజ్వేల్‌రూరల్: పాఠశాల ప్రహరీ గోడను కూల్చిన వారిపై డీఈవోకు సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని కొడకండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకొని కర్రె ఐలయ్య, మల్లేశం ఇండ్లు ఉన్నట్లు తెలిపారు. వారు తమ ఇంటి నిర్మాణం కోసం పాఠశాలకు చెందిన 22 మీటర్ల ప్రహరీని సైతం కూలగొట్టారని, దీంతో భద్రత లేకుండా పోయిందని పేర్కొన్నారు. ప్రహరీని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పొద్దు తిరుగుడు ధాన్యం కొనుగోలు చేయాలి

పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి



మార్కెట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

తొగుట(దుబ్బాక): పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు చేయకుంటే రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 3న కొనుగోలు ప్రారంభించిన అధికారులు కేవలం పది లారీల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసి చేతులెత్తేశారని ఆరోపించారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు నరేందర్‌గౌడ్, మల్లారెడ్డి, కనకయ్య, నర్సిహులు, యాదగిరి, జహంగీర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా గాంధీజీ, అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్ర చేపట్టారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో భారత రాజ్యాంగ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. రిజర్వేషన్ల ఫలాలు దక్కకుండా అపహాస్యం చేసేలా కేంద్రంలోని బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): అనంతసాగర్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నంగునూరు(సిద్దిపేట): ఖానాపూర్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మర్కూక్(గజ్వేల్): సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఘనంగా వరదపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో ఏదుల్ల చెరువు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం వరదపోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. మాధవానంద సరస్వతి స్వామీజీ యంత్ర ప్రతిష్ఠ చేయగా, వేదపండితులు జయరామశర్మ, రామకృష్ణ శర్మల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పట్టణంలో బోనాల ఊరేగింపు కన్నుల పండుగగా జరిగింది. ఉత్సవాలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యవసాయ కళాశాల మంజూరుపై హర్షం



ప్లకార్డులతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలానికి వ్యవసాయ కళాశాల మంజూరు చేసినందుకు ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సంబురాలు జరుపుకున్నారు. బేగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమ రాంరెడ్డి, రాజేందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోకులాశ్రమంలో బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

సిద్దిపేటఅర్బన్: ధర్మాచరణ, ఆరోగ్యం, ఆహార విధానం, తోటి ప్రాణుల సంరక్షణ మొదలైన విషయాలపై మానవాళికి అవగాహన కల్పించడం కోసం శ్రీ వశిష్ట పరంపర ఆధ్యాత్మిక ట్రస్టు (గోకులాశ్రమం) కృషి చేస్తుందని ట్రస్టు వ్యవస్థాపక సభ్యులు మాతా సరళాదేవి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలో గోకులాశ్రమం స్థాపించి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గోకులాశ్రమ వ్యవస్థాపకులు మధుసూదనార్యులు, ఆధ్యాత్మిక గురువులు సత్యజిత్, ఆస్ట్రాలజిస్ట్ ఎన్వీఎస్ రాజా, ట్రస్టు సభ్యులు మోహనయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో, శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం ఉచిత గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సంజీవని సేవ ట్రస్ట్ ప్రతినిధి జగన్నాథ శర్మ, సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు నరేశ్ కుమార్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన నాయకులు



గజ్వేల్: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లాను గురువారం హైదరాబాద్‌లో గజ్వేల్‌కు చెందిన టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇక్బాల్ కలిశారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో తాము కూడా భాగస్వాములమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంద సాయిరెడ్డి, గుర్రాల నర్సిహులు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల అమ్మకంపై నిరసన



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేటకమాన్: హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు యాదగిరి తెలిపారు. హెచ్‌సీయూ ఘటనను నిరసిస్తూ సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్వీ నాయకులు ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులకు, ఔషధ మొక్కలకు నిలయమైన హెచ్‌సీయూ అడవిని వందలాది బుల్డోజర్లతో నేలమట్టం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. భూములను తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, ప్రశాంత్, నరేష్, లింగం, మధు, వంశీ, శ్రీకాంత్, సాయి, మహేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్మీలో ఉత్తమ సేవలందించాలి

దుబ్బాకటౌన్: ఇండియన్ ఆర్మీకి ఉత్తమ సేవలందించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన సాయి వర్ధన్, దుంపలపల్లికి చెందిన రాకేశ్, దుబ్బాకకు చెందిన గౌతమ్ ఇండియన్ ఆర్మీకి ఎంపికవడంతో గురువారం ఆయన కార్యాలయంలో సన్మానించారు.

◆ విద్యార్థులు చదువులో రాణించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చాటిన వారికి బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్, అధ్యాపకులు, సీపీడీసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ స్టీల్ గ్లాస్‌లు పంపిణీ

కోహెడ(హుస్నాబాద్): హోటల్ నిర్వాహకులు వినియోగదారుల కోసం స్టీల్ గ్లాస్‌లను వాడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సౌజన్యంతో సుమారు 23 మంది హోటల్ యాజమానులకు ఒక్కొక్కరికీ 100 స్టీల్ గ్లాస్‌ల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ దేవకి దేవి పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామానికి చెందిన సిద్రమైన నర్సింహులు, సుతారి నాగరాణి, ఎం.మౌనికకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, సీహెచ్. చంద్రం, రమేశ్, బుచ్చులు పాల్గొన్నారు.

◆ దొడ్డి కొమురయ్య జయంతి



నంగునూరు(సిద్దిపేట): కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

నంగునూరు(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని కురుమ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొమురయ్య ఆశయాలను కొనసాగిస్తూ ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్ట్



దుబ్బాకటౌన్: దుబ్బాకలో పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు గురువారం శాంతియుతంగా పోరాటం చేసేందుకు బయలుదేరిన విద్యార్థి సంఘాల నాయకులను జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు అండగా ఉండాల్సిన విద్యాలయాల భూములను వేలం వేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990